కాఫీ బ్రేక్ స్టోరీ

గోడ గడియారం పదకొండు గంటలు కొట్టి విశ్రాంతి తీసుకుంటున్నది. పిల్లలు బళ్ళకు, మొగవాళ్ళు ఆఫీసులకు వెళ్ళడం వల్ల ఇల్లు నిశ్శబ్దంగా వుంది. ఇంటి కోడలు దొడ్లోపని ముగించుకుని తడిచెయ్యి పమిటి చెంగుకు తుడుచుకుంటు వాకిట్లోకి వచ్చింది.

# పిచ్చితల్లి

కొండముది రుక్మిణీదేవి

పండరీ బాయమ్మ శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నది. అటు ఎండకు, ఇటు మబ్బుకు నేపథ్యంలో ఆకాశం నిర్మలంగా, నిర్లిప్తంగా వుంది.

"అత్తయ్యా! అన్నం తిందామా?" కోడలు కామాక్షి అడిగింది.


"ఆ!"

ఆ సమాధానంతో వంటింట్లోకి వెళ్ళి అత్తగారికి, తనకు కంచాల్లో అన్నం పెట్టి మళ్ళీ వాకిట్లోకి వచ్చింది కామాక్షి. ఇంకా అదే భంగిమలో కూర్చున్న పండరీబాయమ్మను చూసి, "అన్నానికి ఆలస్యమౌతున్నది. కంచాల్లో పెట్టాను. రా! అత్తయ్యా!" అన్నది అనునయంగా.

"ఆ! వస్తున్నా!" అంటూ కుర్చీలో నుంచి లేవబోయింది.

పండరీబాయమ్మ నడుములో ఎక్కడో కలుక్కు మంది. ఆ కలుక పాత జ్ఞాపకాల పేటికను తెరిచింది. కలకలు, కన్నీళ్ళు, సేగు బంధాలు కళ్ళ ముందు నిల్చినయ్!

కాపరానికి వచ్చిన నాలుగేళ్ళ వరకు సంతానం లేక పోయేసరికి అత్తగారు చేయించిన పూజలన్నీ చేసింది. ఇమ్మనున్న దానాలన్నీ ఇచ్చింది. ఎవరన్నా "ఆమెకు మతిలేక పోతే నీకు లేదూ? ఏం వయసు మళ్ళిందని పిల్లల కోసం ఇంత ఆరాటం." అని ఎగతాళిగా అంటే, "ఆ! మీకేం తెలుసు? పద్మావతి పసి పిల్లాణ్ని చంకలో ఎగేసుకుంటు, రోడ్డు మీద నడు స్తుంటే ఎంత బాగుంటుందో? సరళ చంటా డికి చందమామను చూపిస్తు బువ్వతినిపిస్తుంటే ఎంత ముద్దుగా వుంటుందో? అంత మంది పిల్లలున్నా పార్వతి పక్కింటి వాళ్ళ పసి గుడ్డును అడ్డాల్లో వేసుకుని ముద్దుల వర్షం కురిపిస్తుంటే,



"అబ్బ! నాకీ నో బిడ్డ..." అనుకునేది మనసులో పండరీబాయమ్మ.

కాలక్రమంలో నలుగురు బిడ్డల తల్లి అయింది. అయిదో సంతానం ఆడపిల్లయితే బాగుండు. ముద్దు మురిపాలు తీర్చుకోడానికి మనసులో మాట చెప్పుకోడానికి అనుకున్నది తను.

అయితే భర్త ఆ అవకాశం ఇవ్వలేదు. "ఇప్పటికే ఇంక్రిమెంటు ఆగిపోయింది. కోడళ్ళు మాత్రం కూతుళ్ళు కారా?" అంటూ ఆస్పత్రికి వెళ్ళాడు. తనకుట్టించిన కొత్త గౌను చూసి "ఇదెవరికి?" అన్నాడు శర్మ.

"మనమ్మాయికే నండీ?" అంటూ ఆఖరి వాడు రాజీకి ఆడపిల్ల డ్రస్సులు, పూల జడలు వేసి తృప్తి పడేది తను.

"అత్తయ్యా! అన్నం తిను." కోడలి హెచ్చరికతో కంచం వైపు చూసింది. ఆనపకాయ ఆనపెట్టిన కూర పెద్దాడికి ఇష్టమని చేసింది. మామిడికాయపప్పు ఆయనకు, నాకు ఇష్టమని చేసింది. పిచ్చి మొద్దు, తన కిష్టమైంది ఎప్పుడూ చేసుకోదు. ఆ! పెద్దదాన్ని ఇక్కడ వున్నాను గనక వాడికిష్టమైనవి కుక్కిన పేనల్లే చేసి పెడుతున్నది. లేకపోతే నా! వాడి నెత్తినెక్కి ఆడించదూ!" అనుకున్నది తనలో తనే! మళ్ళీ అంతలో ఏదో గుర్తొచ్చినట్టు. కామూ! మధ్యాహ్నం బెజవాడ వెళ్ళొస్తానే! పిల్లలు వాళ్ళు ఎట్లా వున్నారో?" అన్నది పండరీ బాయమ్మ.

"మొన్ననే కదత్తయ్యా! వాళ్ళంతా వచ్చి వెళ్ళారు." "అనుకో! ఎందుకో పొద్దుటి నుంచి ధ్యాస అటువెళ్ళింది. ఎట్లాగూ మీ మామగారికి ఆఫీసు. ఆయన కదలరు. వెళ్ళి రెండు రోజుల్లో వచ్చేస్తా!" అంటు చిన్నబాగు తీసుకుని బయ ల్దేరింది. బస్సులో కూర్చున్నంత సేపు వాడి కొచ్చే డబ్బు సరిపోతున్నదోలేదో! వెర్రి నాగన్న ఎవర్నీ ఏదీ అడగడు. పిల్లలందరికీ ఫీజులు కట్టి బళ్ళో చేర్చాడో లేదో... ఇలాంటి ఆలోచనలే! రిక్షా దిగిన పండరీ బాయమ్మను మనమలు, మనుమరాళ్ళు చుటుముట్టారు. "బామ్మా బాగున్నావా? బామ్మా మాకేం తెచ్చావ్? బామ్మా! తాతగారు రాలేదేం" అంటూ. "ముందు బామ్మను లోపలకు రానీం డ్రా!" అంటూ వచ్చింది లలిత. ఎక్కడికో వెళ్ళబోతున్నట్టున్నారు. అందరూ మంచి బట్ట లేసుకున్నారు. లలిత

మెళ్ళో కొత్తగా కొనుక్కున్న నెక్లెసు ధగధగ మెరుస్తున్నది. "ఈ ఊళ్ళో ఎగ్జిబిషన్ పెట్టారు. కాఫీ తాగి మీరూ రండత్తయ్యా! వెళ్దాం!" అన్నది లలిత. అమ్మా! ఎప్పుడో అన్నావుగా గుంటూరు జరీచీర కావాలని, ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకంగా గుంటూరు చీరెల కొట్టు పెట్టారట. కొనేదా నీకు?"

"ఏమిటి డాడీ! అలాగేనా అడగటం. కొనేసెయ్!" పిల్లలు నలుగురూ ఒకసారే అన్నారు.

"ఇదుగో అత్తయ్యా! నేనీ నెక్లెసు, మీ అబ్బాయి వుంగరం మొన్ననే తీసుకున్నాం." అంటూ మెళ్ళో నెక్లెసు, పెట్టెలో వుంగరం తీసి చూపించింది కోడలు లలిత.

ఎగ్జిబిషన్‌లో తిరుగుతున్నంత సేపూ పండరీ బాయమ్మ ఆలోచన ఒకటే. ఏ లోటూ లేకుండా వీళ్ళ సంసారం సాగిపోతున్నది. చల్లగా చూడు భగవంతుడా! తల్లికి నాలుగు వందలు పెట్టి చీర కొన్నాడు రామం. పిల్లలకు కావలసిన వన్నీ తీసుకుని ఇంటికి వచ్చారు. ఎన్ని కష్టాలు పడుతున్నారో అని ఆదుర్దాగా వచ్చిన పండరీబాయమ్మ ప్రశాంతంగా నిద్రపోయింది. అయితే ఆ ప్రశాంతత, ఆనందం నాలుగు రోజులు కూడా నిలవలేదు. రామం కుటుంబం సంతోషంగా వున్నదంటే తాము చేసిన పెళ్ళి. వంశం, మర్యాద, అన్నీ చూసి పద్ధతి ప్రకారం చేశారు. కానీ... కానీ రమణ అలా కాదు. పెద్ద చదువులు చదివాడు. ఆ అమ్మాయి... అది కోడలు కూడా బాగా చదువుకున్నది. ఇద్దరూ ఇష్టపడి రిజిష్టరు పెళ్లి చేసుకున్నారు. ముందువున్న వూపు, ఉత్సాహం పెళ్ళయిన తరువాత వుండవ్! నా దగ్గర కొచ్చిన నాలుగు రోజులు ఏదో అన్యోన్యంగా వున్నట్టు కనపడ్డా ఆ అమ్మాయి వీడి మాట వింటుందా! వీడికీ కోపం ఎక్కువే! ప్రేమ పెళ్ళిళ్ళు, రిజిష్టరు పెళ్ళిళ్ళు తాలూకు మంటల్లాంటివి క్షణిక ఆవేశాలు, కావేషాలు మనుషుల్ని దూరం చేస్తాయ్! మమతల్ని నలిపేస్తాయ్! క్షణం అక్కడ వుండబుద్ధి కాలేదు. తెల్లవారి లేస్తూనే "ఒరే! రామం. ఇవ్వాళ నీ తమ్ముడి దగ్గర కెళ్తారా?!" అన్నది పండరీబాయమ్మ.

"ఇప్పుడెందుకమ్మా! అక్కడికి. వాళ్ళిద్దరూ ఉద్యోగాలకు వెళ్తే ఒక్కదానికి ఏంతోస్తుంది!" అన్నాడు రామం. "వంటరి వాళ్ళు! వాళ్ళే వచ్చి మిమ్మల్ని చూసి వెళ్తార్లే!" అన్నది లలిత.


జాన్సన్ అండ్ జాన్సన్ వారి

న్యూ ఫ్రెష్ డేస్ పాంటీ లైనర్స్




జాన్సన్ అండ్ జాన్సన్ వారు మహిళలు ప్రతి నిత్యం వుపయోగించి హాయిగా ఫ్రెష్‌గా వుండేందుకు వీలుగా "న్యూ ఫ్రెష్ డేస్ పాంటీ లైనర్స్"ను మార్కెట్లో ప్రవేశపెడుతున్నారు. ఇవి శానిటరీ నాప్‌కిన్స్ కావు. వీటిని ప్రతినిత్యం వాడుకోవచ్చు. వీటికి మూడు అతుక్కొని అంటి వుండేలా జిగురుతో కూడిన పీలికలు వుండి పాంటీలో ధరించే వీలుగా వుంటాయి. అర్జెంటుగా క్యాంప్‌లకు వెడుతున్నప్పుడు, టీ పార్టీ, డిన్నర్లప్పుడు ఎంతగానో వుపయోగపడతాయి. 15 పాంటీలైనర్స్ గల పేకట్ ధర రూ. 16.25. 25 పాంటీ లైనర్స్ గల పాక్ రూ.25-95 మాత్రమే.


"కాదులేండ్రా! వాళ్ళకు శలవు దొరుకుతుంది. దొరకదు, నేనే వెళ్తాను."

* * *

పండరీబాయమ్మ రాక ఆ ఇంటికి పండగ అయింది. రమణ, శ్రీ లక్ష్మిల ఆనందానికి అంతు లేదు. భూతల స్వర్గంలాంటి ఆ వాతావరణం ఆమెకు ఎంతగానో తృప్తి నిచ్చింది.

"నేను బ్లాక్ అండ్ వైట్ టి.వి. కొనమంటే కలర్ టి.వి. కొన్నారత్తయ్యా!" అన్నది శ్రీలక్ష్మి.

"నువ్వు మాత్రం తక్కువ తిన్నావా? వి.సి.పి. కొందాం అంటే వి.సి.ఆర్.ని కావాలని పట్టుబట్టలేదూ!" భార్యవైపు కొంటెగా చూస్తు అన్నాడు రమణ.

"ఇదిగో! ఈ ఫ్రిజ్ చాలా అవసరంగా వుంది. అందుకనే కొన్నాం."

ఒకదాని తరువాత ఒకటిగా వంతు వేసుకుని కొడుకు, కోడలు చెబుతుంటే బుగ్గన చెయ్యి పెట్టుకుని వింటున్నది పండరీబాయమ్మ!

"ఆ చెప్పు!" అన్నాడు రమణ.

"ఏమిటి?!" అన్నది శ్రీ లక్ష్మి.

"అదే!"

"ఏమిటది?"

"ఊ... ఊ..." ఛీ పోండి. సిగ్గుల మొగ్గయింది శ్రీలక్ష్మి.

"అమ్మ దొంగల్లారా! నేను నిన్ననగా వస్తే ఇప్పుడా ఆ సంగతి చెప్పడం?" నోటి నిండా నవ్వుతూ అన్నది పండరీబాయమ్మ.

"దొంగలు, దొరలు అంటూ వచ్చే నేమిటోయ్! పండూ! చెప్పా పెట్టాకుండా! అక్కడ కోడలు పిల్లలు కలవరిస్తున్నారు నీ కోసం. పెళ్ళి వారు తెగ తిరిగి పోతున్నారు."

"పెళ్ళి వారేమిటి?"

"నాలుగో కొడుకు సంగతి మర్చిపోయావా? వాడు ఉద్యోగంలో చేరి మూడేళ్ళయింది."

"అయితే..."

"అయితే ఏమిటోయ్! పెళ్ళి చెయ్యవా? వాడింకా పూలజడ వేసుకుని, గౌన్లుతొడుక్కుని తిరిగిన పాపాయి అనుకుంటున్నావా?" వ్యంగ్యంగా అన్నాడు శర్మగారు.

"అవును సుమా! వాణ్ణి ఓ ఇంటి వాణ్ణి చేస్తే మన బాధ్యత తీరుతుంది."

"అవున్లే! అప్పుడు ఆ కొడుకు, కోడలు ఎట్లా వున్నారో అని మరో వూరికి టిక్కట్టు కొనుక్కోవచ్చు!"

"మీ రెంత వెక్కిరించినా పిల్లల్ని గన్న పిచ్చి తల్లిని నేను. కడుపు తీపి రమ్మంటే వచ్చేదీ, పొమ్మంటే పోయేదీ కాదు." అంటు బట్టలు సర్దటం మొదలు పెట్టింది పండరీబాయమ్మ.